

పేరుకుపోతున్న చెత్త

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలో కొన్ని రోజులుగా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. దీంతో పలు చోట్ల చెత్త పేరుకుపోతోంది. గతంలో నిత్యం ప్రక్రియ జరిగేది. మైక్‌లో చెప్తూ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సేకరించేవారు. అయితే కొన్ని రోజులుగా సిబ్బంది రావడంలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చిన్న వీధుల్లోని చెత్తను తీసుకెళ్లడంలేదని ఆరోపిస్తున్నారు.

ఆటో.. ఎటో

పొదలకూరు: రోడ్లపై ఆటోలను అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం పదుల సంఖ్యలో ఆటోలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి మెయిన్ రోడ్లపై నిలుపుతున్నారు. దీంతో పాదచారులే కాకుండా వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. ఆటోలతో ప్రమాదాలూ సంభవిస్తున్నాయి.





వామ్మో.. మలుపులు

పొదలకూరు: మండలంలోని పొదలకూరు – నావూరు మార్గంలో పదుల సంఖ్యలో ప్రమాదకర మలుపులున్నాయి. ఫలితంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కర్రతుమ్మ చెట్లు ఏపుగా పెరగడంతో ద్విచక్రవాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. హారన్ ఇవ్వకుండా మలుపు తిరిగేందుకు యత్నిస్తే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరు వద్ద మలుపులు అధికంగా ఉన్నాయి. కొత్తగా ఈ మార్గం మీదుగా వెళ్లే వాహనచోదకులకు ఇబ్బంది ఏర్పడుతోంది.

క్లుప్తంగా

ఆరెస్సెస్ నేతల సమావేశం



పొదలకూరు: స్థానిక సాయిబాబా మందిరంలో ఆరెస్సెస్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. వివిధ అంశాలపై పలువురు మాట్లాడారు.

విద్యార్థులకు జిల్లా స్థాయి సెమినార్ రేపు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 14న వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ చాలెంజ్ అనే అంశంపై జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈఓ బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్ అనంతరం రాత పరీక్ష, ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 5 చార్టులు/స్లైడ్స్ ఉపయోగించుకుని ఆరు నిమిషాల పాటు ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పోటీలకు హాజరు కావాలన్నారు. అత్యుత్తమ ప్రదర్శన చూపిన ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వీరు ఈనెల 15న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్కడి విజేతలకు ఈనెల 30న బెంగళూరులో జాతీయస్థాయి సైన్స్ సెమినార్ జరుగుతుందన్నారు. కాగా పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు ఈనెల 13వ తేదీలోపు జిల్లా సైన్స్ అధికారి 93471 21712 వాట్సప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

ఇరుకళల పరమేశ్వరికి బంగారు హారం బహూకరణ



నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి మునగల మహేష్‌రెడ్డి– కీర్తిరెడ్డి దంపతులు బంగారు నెక్లెస్ హారాన్ని ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ గిరికృష్ణ మాట్లాడుతూ 35 గ్రాముల బంగారు హారాన్ని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్‌కు కుటుంబసభ్యులతో కలిసి అందజేశారన్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, వేదాశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వ విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తోటపల్లిగూడూరు: ఏడాదిన్నర పాలనలో అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోడూరు నేత పుల్లూరు శేషు పేర్కొన్నారు. అక్రమ నిర్బంధం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విముక్తి పొందిన నేపథ్యంలో కోడూరులోని ముక్కంటమ్మ దేవాలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శేషు మాట్లాడారు. కోడూరు మేజర్ పంచాయతీలో రూ.4 2 లక్షల ప్రభుత్వ నిధులను టీడీపీ నేతలు దోచుకున్నారని ఆరోపించారు. అనంతరం పార్టీ మత్స్యకార నేత పామంజి దుర్గా మాట్లాడారు. కల్తీ మద్యం బారినపడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నా, ప్రభుత్వ పెద్దలు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతి, అరాచకాలను ప్రశ్నించినందుకే కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. నేతలు కంజి శ్రీరాములు, సురేష్, నరేష్, పవన్, హరి, ప్రసాద్, రాము, రమణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని బాగు చేసుకుందాం



మనుబోలు: మనం – మన ఊరు కార్యక్రమం ద్వారా గ్రామాన్ని బాగుచేసుకుందామని ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ పేర్కొన్నారు. మండలంలోని జట్ల కొండూరు పంచాయతీ పరిధిలో గల అరుంధతీయవాడలో మనం – మన ఊరు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మాతమ్మ గుడి వద్ద స్థానికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని ఏడు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపి.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామని ప్రకటించారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఒక దళితుడు కాబట్టి ఆయనపై దాడికి యత్నం జరిగిందన్నారు. గతంలో సుప్రీంకోర్టు జస్టిస్‌లుగా పనిచేసిన వారిపై ఇలాంటి దాడులు జరగలేదని తెలిపారు. ఒక దళితజాతికి చెందిన జస్టిస్‌కు ఇలాంటి అవమానం జరగడం దళితులను కన్నీళ్లు పెట్టిస్తోందన్నారు. ఆంధ్రాకు చెందిన దళితుడు హరియాణాలో డీజీపీలో స్థాయి పోలీస్ అధికారిగా పనిచేస్తుంటే బీజేపీ ప్రభుత్వంలో తనకు జరిగిన అవమానం తట్టుకోలేక తుపాకీతో కాల్చుకుని చనిపోయారని తెలిపారు. హరియాణా ప్రభుత్వ వేధింపులే కారణమని తొమ్మిది పేజీల నోట్ రాశారని వివరించారు. బీజేపీ, కూటమి ప్రభుత్వంలో దళిత ఆఫీసర్లకు గౌరవ మర్యాదలు లేవని, ఉద్యోగస్తులను అవమానిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి పట్టపగలు నిప్పుపెట్టడం దారుణమన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు కారకులకు గుణపాఠాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమీవుల్లా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

నేడు కోవూరులో 'కోటి సంతకాల సేకరణ'

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమం కోవూరు మండలంలో సోమవారం ప్రారంభం కానుందని పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో జరుగనున్న కార్యక్రమానికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విచ్చేయనున్నారన్నారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర రేపు

పొదలకూరు: తిరుమలకు భక్తుల పాదయాత్ర మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభంకానుందని పట్టణంలోని శ్రీలక్ష్మి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనాలనుకునే వారు దేవస్థానం వద్దకు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 97016 39156 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పిడుగుపాటుకు కాలిపోయిన పరికరాలు

పొదలకూరు: పిడుగుపాటుతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సామగ్రితో పాటు ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. కేబుల్ ఆపరేటర్ల సిబ్బందికి వరుసగా ఫిర్యాదులు ఆదివారం అందడంతో వారు వెళ్లి పరిశీలించారు. పదుల సంఖ్యలో పిడుగులు శుక్రవారం అర్ధరాత్రి పడ్డాయి. దీంతో చాలా ఇళ్లలో ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయి., ట్రాన్స్‌ఫార్మర్లు సైతం కాలిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆకాశం మేఘావృతమై శబ్దాలు వినిపిస్తే జనాలు బెంబేలెత్తుతున్నారు.

వీఆర్‌ఏకు షోకాజ్ నోటీసులు

కొడవలూరు: మండలంలోని పాతవంగల్లు వీఆర్‌ఏ(గ్రామ సహాయకుడు) పెనమల్లి శ్రీనివాసులుకు తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీఆర్‌ఏ శ్రీనివాసులు గ్రామ వీఆర్వో సంతకం ఫోర్జరీ చేసి ఇంటి ధ్రువీకరణ పత్రం జారీ చేశారని బొంతలపాళెం గ్రామానికి చెందిన వడ్లమూడి నరేంద్ర తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన ఆమె వీఆర్‌ఏకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంతకం ఫోర్జరీకి పాల్పడినందున చర్యలు ఎందుకు తీసుకోకూడదో సమాధానం చెప్పాలని అందులో కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం వినాయక గిరిజన కాలనీలో నాలుగు గుడిసెలు శనివారం దగ్ధం కావడం తెలిసిందే. అగ్నికి ఆహుతై సర్వం కోల్పోయిన నాలుగు గిరిజన కుటుంబాలను జనసేన నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు నిత్యావసరాలు, మంచాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దాసరి పోలయ్య, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి వెంకటేశ్వర నేత్రాలయ వైద్యులు పరీక్షించారు. 320 మందికి నేత్ర పరీక్షలను నిర్వహించి, 100 మందికి మందులను అందజేశారు. 85 మందికి కళ్లద్దాలను పంపిణీ చేయగా, 70 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వెంటనే వీరికి శస్త్రచికిత్సలు చేయించనున్నామని ట్రస్ట్ ఏఓ కృష్ణ పేర్కొన్నారు. వైద్యులు లహరి, సింధు, ఆకాంక్ష, విజేత స్కూల్ కరస్పాండెంట్ కామాక్షి, మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామనాయుడు, సిబ్బంది జీవన్ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదంతో రెండిళ్ల దగ్ధం

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని బ్రహ్మదేవం పంచాయతీ పరిధిలో గల ఎస్టీ కాలనీలో అగ్నిప్రమాదం ఆదివారం సంభవించింది. వివరాలు.. సబ్‌స్టేషన్ ఎదురుగా గుడిసెలు వేసుకొని గిరిజనులు నివసిస్తున్నారు. ఈ తరుణంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. గ్యాస్ సిలిండర్ పేలింది. పద్మ, ముసునూరు రమణమ్మ ఇళ్లు పూర్తిగా దగ్ధం కావడంతో వారు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. బాధితులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బయ్య, బషీర్, సాయి, మణి తదితరులు పాల్గొన్నారు.



పెంచలరావుకు కన్నీటి నివాళి

నెల్లూరు(అర్బన్): చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు(50) భౌతిక కాయానికి పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు కన్నీటి నివాళులర్పించారు. ఆయన భౌతిక కాయాన్ని అధికారులు, ఉద్యోగుల సందర్శనార్థం స్థానిక దర్గామిట్టలోని ఎన్‌జీఓ భవన్‌లో ఆదివారం ఉంచారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాతతో పాటు అసోసియేషన్ నాయకులు లక్కాకుల పెంచలయ్య, కార్యదర్శి రామకృష్ణ, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, చొప్పా రవీంద్రబాబు, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్కాకుల పెంచలయ్య, చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వైద్యశాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్న మన్నేపల్లి పెంచలరావు వివాద రహితుడన్నారు. పీఆర్సీని అమలు చేయాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలనే డిమాండ్లతో అన్ని సంఘాలను కలుపుకుని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన లేనిలోటు తీరని నష్టం అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని ప్రకటించారు.



పెంచలరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సానుభూతి తెలపని ప్రజాప్రతినిధులు

కాగా ఉద్యమనేత మన్నేపల్లి పెంచలరావు మృతదేహాన్ని జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులెవరూ సందర్శించలేదు. కుటుంబ సభ్యులను పరామర్శించలేదు. అలాగే కలెక్టర్ కూడా పట్టించుకోలేదని ఉద్యోగ వర్గాలు విమర్శిస్తున్నాయి.

నవంబర్ 5 నుంచి మహాకార్తీక దీపోత్సవం

నెల్లూరు(బృందావనం): స్వర్ణాలచెరువు గణేష్ ఘాట్ వద్ద నవంబర్ 5, 6, 7 తేదీల్లో మహాకార్తీక దీపోత్సవం జరుగనుందని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కె.వెన్నెల తెలిపారు. రామ్మూర్తినగర్‌లోని ఎన్నార్ ఫంక్షన్ హాల్లో దీపోత్సవ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహిస్తున్న మహాకార్తీక దీపోత్సవం ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో పేరు ప్రతిష్టలు గడించిందన్నారు. సమితి కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద, కార్యనిర్వాహక అధ్యక్షుడు కోడూరు జయరామ్, కార్యదర్శి ముక్కాల వ్యాస ప్రసాద్, శ్రీకంఠం రమణయ్య, బాలసుబ్బారావు, రమేష్, ఏవీఆర్ మోహన్‌రావు, పి.సురేందర్‌రెడ్డి, కిశోర్, హర్షవర్ధన్, శ్రీనివాసులు, రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.



సింహపురి కార్తీక దీపోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

గడ్డి తరలింపునకు సౌలభ్యంగా..



వరిగడ్డిని తరలించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ట్రక్కు



కొత్త ట్రక్కులో తరలిస్తున్న గడ్డి

కొడవలూరు: వరిగడ్డిని తరలించేందుకు సౌలభ్యంగా వినూత్న ట్రక్కులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అన్నిచోట్లా వరి కోతలు యంత్రాల ద్వారానే జరుగుతున్నాయి. ఈ విధంగా వచ్చిన గడ్డిని సౌలభ్యంగా కట్ట కట్టేందుకు యంత్రాలు అందుబాటులో ఉండడం తెలిసిందే. కాగా కట్టకట్టిన గడ్డిని తరలించేందుకు ప్రత్యేక ట్రక్కులు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ఈ ట్రక్కుల్లో గడ్డి కట్టలను అమర్చేందుకు సౌలభ్యంగా రూపొందించారు. గతంలో ట్రాక్టర్‌కు ఉన్న ట్రక్కుల కంటే ప్రస్తుతం ఉన్నవి నాలుగు రెట్లు ఎక్కువ గడ్డిని అమర్చే వెసులుబాటు ఉంది. కాగా మండల పరిధిలో యంత్రాలతో వరి కోతలు పూర్తయిన నేపథ్యంలో వచ్చే గడ్డిని ఈ ట్రక్కుల ద్వారా తరలిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరిగడ్డికి భలే గిరాకీ ఉంది. పశువుల మేత కోసం భారీ ధర వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితంతో పోల్చుకుంటే వరిగడ్డి ధర నాలుగింతలు పెరిగింది. అయినప్పటికీ పశువుల మేత, పూరిళ్ల పైకప్పు నిమిత్తం కొనుగోలు చేసేందుకు బాగా ఆసక్తి కనబరుస్తున్నారు. వరి కోతల సమయంలో ఎక్కడ చూసినా ట్రాక్టర్‌లు ఈ తరహా ట్రక్కులనే అమర్చుకొని గడ్డిని తరలిస్తూ కన్పిస్తుండడం గమనార్హం.

మత్తుతో బాల్యం చిత్తు

- విచ్చలవిడిగా వైట్నర్ విక్రయం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

లాభాపేక్షే ధ్యేయంగా కొందరు వ్యాపారులు ఇంకును చెరిపే వైట్నర్‌ను బాలలకు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఈ వైట్నర్‌ను పీల్చుతూ బాలలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ దుస్థితి మండలంలోని నార్తురాజుపాళెంలో నెలకొంది.

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో 300లకు పైగా గిరిజన కుటుంబాలు ఉన్నాయి. తూర్పు కాలువ కట్ట, రైల్వే ట్రాక్ పక్కన, రైల్వేగేటు పక్కన గుడిసెలు వేసుకొని వీరంతా జీవనం సాగిస్తున్నారు. ఈ కుటుంబాల్లో 10 నుంచి 15 ఏళ్లలోపు బాలలు వంద మందికిపైగా ఉన్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ పిల్లల్లో 90 శాతం మంది వైట్నర్ మత్తుకు బానిసలుగా మారారు. ఐదేళ్ల క్రితం కొందరు చిన్నారులు రహస్యంగా వైట్నర్‌ను పీల్చేవారు. ప్రస్తుతం ఒకరికొకరు అలవాటుగా మార్చుకొని బహిరంగ ప్రదేశాల్లోనూ పీల్చుతున్నారు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్తూ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. దీంతో బాలలు దుకాణాల్లో తక్కువ ధరకే లభ్యమయ్యే వైట్నర్‌ను కొనుగోలు చేసి పీల్చుతూ మత్తుకు బానిసలుగా మారుతున్నారు.

లాభాపేక్షే లక్ష్యంగా విక్రయాలు

బాలలకు వైట్నర్‌ను విక్రయించరాదన్న నిబంధన ఉంది. కానీ నార్తురాజుపాళెంలోని కొందరు వ్యాపారులు లాభాపేక్షే ధ్యేయంగా వీటిని బాలలకు విక్రయిస్తున్నారు. పెన్ రాతను చెరిపేందుకు వాడే వైటన్నర్ చిన్నారులకు అవసరం లేదు. ఈ విషయం వ్యాపారులకు తెలిసినా కాసులకు కక్కుర్తి పడి విక్రయించేస్తున్నారు. దీంతో గిరిజన బాలలు అనారోగ్యం పాలవుతున్నారు. స్థానిక దుకాణాల్లో వైట్నర్‌ను విక్రయించకుంటే మరో ప్రాంతానికి వెళ్లి గిరిజన బాలలు కొనుగోలు చేయరు. వ్యాపారులు బాలలకు అమ్మకాలను నిలిపివేయడం ద్వారా గిరిజన బాలలను మత్తు బారి నుంచి కాపాడవచ్చు. కానీ ఆ దిశగా వ్యాపారులు ఆలోచించడం లేదు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి బాలలకు వైట్నర్ విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నార్తురాజుపాళెం సెంటర్‌లో బాహాటంగానే వైట్నర్‌ను పీల్చుతున్న బాలుడు(ఫైల్)